

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోపాల్

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ప్రజలందరూ కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. సోమవారం కవాడిగూడ డివిజన్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాణా ప్రతాప్ సింగ్ ఆధ్వర్యంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. దరఖాస్తు చేసుకున్న 97 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, 44 మంది కల్యాణలక్ష్మి పథకం మొత్తం 141 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. దరఖాస్తు దారులకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ముఠాజైసింహా, బీఆర్ఎస్ కవాడిగూడ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, వి శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న చిక్కా దేవదాసు తదితరులు

సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

● చేనేత వర్గాల చైతన్య వేదిక డిమాండ్

చిక్కడపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం పద్మశాలి మహాసభలో యావత్ పద్మశాలీల చేనేత కళాకారుల పవిత్రమైన చేనేత మగ్గంపై సీఎం రేవంత్‌రెడ్డి కాళ్లకు నల్లబూట్లు వేసుకుని చేనేత మగ్గం నేసిన తీరును నిరసిస్తూ చేనేత వర్గాల చైతన్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ప్రకటించారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం అశోక్‌నగర్‌లోని ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద చేనేత వర్గాల చైతన్యవేదిక ఆధ్వర్యంలో వేదిక నేతలు, సభ్యులు నల్ల బ్యాడ్జీలు ధరించిన నిరసన ప్రదర్శన నిర్వహించి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చేనేత వర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు డా.చిక్కా దేవదాసు మాట్లాడుతూ యావత్ పద్మశాలీలు, చేనేత కార్మికులు వివిధ రాష్ట్రాల్లో, జిల్లాల్లో ముక్తకంఠంతో సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మ నరేందర్, మార్గం అమర్, వంశీ చింతకింది, బల్లాప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్‌అలీని ఎమ్మెల్సీ చేసి మంత్రి పదవి ఇవ్వాలి

● రాష్ట్ర మహిళా కాంగ్రెస్

చిక్కడపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీని ఎమ్మెల్సీ చేసి మంత్రి పదవి ఇవ్వాలని రాష్ట్ర మహిళాకాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వరిరవిప్రసాద్ పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ పేరు లేకపోవడం బాధాకరమైన విషయమని జ్ఞానేశ్వరి పేర్కొన్నారు. సోమవారం షబ్బీర్ అలీని మర్యాదపూర్వకంగా కలిసిన ఆమె మాట్లాడుతూ ఏఐసీసీ, టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం స్పందించి షబ్బీర్ అలీని ఎమ్మెల్సీ చేసి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు.



జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవి కిరణ్‌కు వినతిపత్రం అందజేసిన దిశా కమిటీ సభ్యుడు నందగిరి నర్సింహ, చంద్రమోహన్ తదితరులు

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు

ముషీరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్‌లో అసంపూర్తిగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు రూ.20 లక్షలు మంజూరు అయ్యాయని దిశా కమిటీ హైదరాబాద్ జిల్లా సభ్యుడు నందగిరి నర్సింహ తెలిపారు. సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి ఇందిరానగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నందగిరి నర్సింహ మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పారిశుధ్య కార్మికులకు కమ్యూనిటీ హాల్ ఆవరణలో ప్రత్యేక గదిని నిర్మించాలని కోరారు. స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రమోహన్, జీహెచ్ఎంసీ డీఈ సన్నీ తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడ సీఐ జ్యోత్స్న తల్లోజును శాలువాతో సత్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు హరినాథ్‌రెడ్డి, దేవి రెడ్డి విజితారెడ్డి తదితరులు

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

● కాచిగూడ సీఐ జ్యోత్స్న

బర్కత్‌పుర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహరించాలని కాచిగూడ సీఐ జ్యోత్స్న తల్లోజు కోరారు. సోమవారం కాచిగూడ పీఎస్‌లో సీఐతోపాటు ఇతర మహిళా సిబ్బందిని కాంగ్రెస్ నేతలు దేవిరెడ్డి విజితారెడ్డి, హరినాథరెడ్డిలు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని అన్నారు. పోలీస్ నుంచి దేశరక్షణవరకు మహిళలు ప్రధాన భూమిక పోషిస్తున్నారని ఆమె అన్నారు. మహిళా సాధికారితతోనే సమాజ అభివృద్ధి చెందుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మహేష్ యాదవ్, శ్రావణ్, మధుసుదన్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, రాంమోహన్, మురళీ, లక్ష్మణ్, శాంతమ్మ, సాయి మధు పాల్గొన్నారు.

జ్యోత్స్నకు అమెరికా మల్టీ ఎత్నిక్ కమిషన్ అవార్డు



బర్కత్‌పుర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌కు చెందిన టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ జ్యోత్స్న తిరునగరికి అమెరికన్ మల్టీ ఎత్నిక్ కమిషన్ ప్రపంచంలోని 20 మంది ఉత్తమమహిళల్లో ఒకరిగా ఎంపిక చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 12న అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును అందుకోనున్నారు. సోమవారం రాత్రి అమెరికాకు బయలుదేరే ముందు ప్రొఫెసర్ జ్యోత్స్న నింబోలి అడ్డలోని కార్యాలయంలో విలేరులతో మాట్లాడుతూ, మహిళల సమానత్వం సాధికారతకు కృషి చేస్తుండటం వల్లే ఈ అవార్డుకు ఎంపిక చేశారని ఆమె చెప్పారు.

తాగునీరు రోడ్డుపాలు



చిక్కడపల్లిలోని వెంకటస్వామి వీధిలో వృథాగా పోతున్న తాగునీరు

- పట్టించుకోని జలమండలి అధికారులు
- పలుచోట్ల కలుషిత నీరు సరఫరా
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

రాంనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జలమండలి సబ్ డివిజన్ అధికారుల పర్యవేక్షణ లోపం, స్థానిక సిబ్బంది నిర్లక్ష్యంతో డివిజన్ పరిధిలోని చిక్కడపల్లిలో మంచినీరు పైప్‌లైన్లు లీకై తాగునీరు రోడ్డుపై వృథాగా పారుతోంది. వేసవి కాలంలో తాగునీరు నల్లాల్లో సరిగ్గా రాకపోవడంతో ప్రజలకు తాగడానికి సరిపడ మంచినీరు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. లీకేజీ పోనూ వచ్చే నల్లా నీరులో వచ్చే కొన్ని ప్రాంతాల్లో కలుషిత నీరు రావడంతో అవి తాగడానికి వీల్లేని పరిస్థితి నెలకొంది. దీంతో చిక్కడపల్లివాసులు తాగునీటి కోసం క్యాన్ నీరును కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి నెలకొంది. నీరు కొనుగోలు చేసే శక్తి లేని పేదలు గాంధీనగర్ సబ్ డివిజన్‌లోని నీటి ట్యాంకు వద్దకు వెళ్లి సైకిల్, తోపుడు బండ్లపై తీసుకోవాల్సి వస్తుంది. ముఖ్యం గా చిక్కడపల్లిలోని స్ట్రీట్ నంబర్ 10 వెంకటస్వామి వీధిలో 1-8-80 ఇంటి వద్ద గల వాల్ నుంచి సగం నీరు లీకై రోడ్డు పాలవుతుంది. దీంతో ఆ వీధిలో తాగునీరు లోప్రెషర్‌తో వచ్చి తాగునీరు సరిపోవడం లేదు. అదే విధంగా బాగ్‌లింగంపల్లి నుంచి చిక్కడపల్లి మెయిన్ రోడ్డు లోని 1-8-507 ఇంటి వద్ద కృష్ణ జువెలరీ షాపు వద్ద తాగునీరు వృథాగా పోతుంది. దీంతో ఇక్కడ కూడా నల్లాల్లో నీటి ప్రెషర్ తగ్గి మంచినీరు తక్కువగా వస్తుంది. చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వీధిలోని 1-8-462/7 ఇంటి వీధిలో కొంత కాలంగా కలుషిత నీరు సరఫరా కావడంతో తాగడానికి వీల్లేని పరిస్థితి నెలకొంది. చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి వీధిపై భాగాన నెల రోజుల నుంచి నల్లాల్లో చుక్క నీరు రాని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు.



చిక్కడపల్లి నుంచి బాగ్‌లింగంపల్లి రోడ్డులో వృథాగా పోతున్న తాగునీరు



వేంకటేశ్వర స్వామి వీధిలో సరఫరా అవుతున్న కలుషిత నీరు

అధికారులు, పట్టించుకోవడం లేదు



చిక్కడపల్లి ప్రాంతంలో వృథా అవుతున్న తాగునీరు, లోప్రెషర్, కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని ఆరు నెలలుగా జలమండలి అధికారులు, సిబ్బంది, ఎమ్మెల్యే కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేసినా ఎవరు స్పందించడం లేదు. వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో నీటి వృథాను అరికట్టాల్సిన అధికారులు స్పందించకపోవడం బాధాకరం. నీరు లేక చాలా మంది క్యాన్‌లో నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. వెంటనే జలమండలి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- డి.చంద్రమోహన్, చిక్కడపల్లి

భక్తులతో కిటకిటలాడిన శ్యాంబాబా మందిర్

● నగర నలుమూలల నుంచి నిషాన్‌యాత్రలు



పాల్గుణి మేళాలో పాల్గొన్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, నిషాన్ యాత్రలో యువతీ, యువకులు

బర్కత్‌పుర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ వీరన్నగుట్టలోని శ్యాంబాబా మందిర్‌లో పాల్గుణిమేళా ఉత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. మహాభారత యుద్ధంలో కలియుగ కృష్ణుడుగా భావించే శ్యాంబాబా తన శిరస్సును దానమిచ్చిన రోజును పాల్గుణిమేళా ఉత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవాల సందర్భంగా శ్యాంబాబా దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. శ్యాంబాబాకు 56 రకాల మిఠాయిలను నైవేద్యంగా సమర్పించారు.

నిషాన్‌యాత్ర...

పాల్గుణిమేళా ఉత్సవాన్ని పురస్కరించుకొని వందలాది మంది యువతీ, యువకులు నగర నలుమూలల నుంచి నిషాన్‌యాత్రను శోభాయమానంగా నిర్వహించారు. రంగురంగుల జెండాలను చేతపట్టుకొని భక్తి పాటలు, భజనలు, నృత్యాలు చేసుకుంటూ శ్యామ్‌బాబా మందిర్‌కు చేరుకున్నారు. మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్, అఫ్జల్‌గంజ్, చార్మినార్, గుల్జార్‌హౌజ్, బేగంబజార్, గోషామహల్, నాంపల్లి, నాచారం, పాతబస్తీలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ యాత్ర నిర్వహించారు.

శ్యామ్‌బాబా దేవాలయం వద్ద నిషాన్ యాత్రకు శ్యాంమందిర్ సేవాసమితి అధ్యక్షుడు చంద్రకాంత్ లగోటియా, కార్యదర్శి ఇంద్రకరణ్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శులు రాందేవ్ ఆగర్వాల్, రాజ్‌కుమార్ విగ్, సురేష్ ఆగర్వాల్, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు.

పాల్గుణిమేళ ఉత్సవాలలో తూర్పు మండలం అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య, కాచిగూడ పీఎస్ ఎస్ఐ సుభాష్, బీజేపీ నేతలు సుభాష్‌పటేల్, సంతోష్, భీమ్‌రాజ్, కృష్ణ, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

2026 నాటికి రూ.10 వేల కోట్ల టర్నోవర్

● టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది 2026 నాటికి ఆర్టీసీ రూ.10 వేల కోట్ల టర్నోవర్ చేరుకునే అవకాశముందని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. సోమవారం సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో కార్పొరేట్ ఫెయిల్యూర్ అండ్ డిజిటల్ ఫ్రాడ్, విజయానికి మార్గాలపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సజ్జనార్ మాట్లాడుతూ 2021 సెప్టెంబర్‌లో ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించినప్పుడు కార్పొరేషన్ మొత్తం టర్నోవర్ రూ.3800 కోట్లు కాగా, నాలుగేళ్లలో దాన్ని భారీగా పెంచి ఇప్పుడు ఇది బిలియన్ డాలర్ల కంపెనీగా మార్చినట్లు తెలిపారు. ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న 50 వేల మంది ఉద్యోగుల నిబద్ధత, ధృడ సంకల్పం, ప్రభుత్వ మద్దతుతో ఇది సాధ్యమైనదన్నారు. ప్రస్తుతం ఏఐ, బిగ్ డేటా పెరుగుదల డిజిటల్ మోసాల పరిధిని పెంచిందన్నారు. డిజిటల్ మోసాలు నిరోధించడానికి సైబర్ సెక్యూరిటీపై సిబ్బందికి శిక్షణ ఇవ్వడం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు సాయిరామ్, ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడు ఆర్.రవికుమార్, కెకె.మహేశ్వరి, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

నాకోసం వెతకొద్దు... తనువు చాలిస్తున్నా..

● భర్తకు వీడియో కాల్ చేసిన భార్య

● రెండు రోజులుగా తీవ్రంగా గాలింపు..

● నేటికీ దొరకని ఆచూకీ

బాలానగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'నాకు క్యాన్సర్ ఉంది.. నేను కోలుకోలేను. మిమ్మల్ని ఇబ్బంది పెట్ట దలుచుకోలేదు. అందుకే నేను కాశీకి వెళ్లి తనువు చాలించాలని అనుకుంటున్నాను. నాకోసం వెతక కండి. బాబును స్కూలు వద్ద దింపి వెళుతున్నా..' అంటూ భర్తకు సమాచారం ఇచ్చి ఓ ఇల్లాలు అదృశ్యమైంది. ఈ ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడే ఈ ఘటన చోటుచేసుకున్నప్పటికీ ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. వివరాలిలా ఉన్నాయి. బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధి బాల్‌రెడ్డినగర్‌లో ధన్యాకుల రమేష్‌బాబు, ఉమారాణి (40) దంపతులు నివసిస్తున్నారు. వీరికి కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా ఉమారాణి క్యాన్సర్‌తో బాధపడుతున్నది. చికిత్స చేయించుకుంటున్నా నయం కావడం లేదనే మనోవ్యథతో ఆవేదన చెందుతుండేది.

అయితే, భర్తను కష్టపెట్టవద్దని అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8న) రోజున నిర్ణయం తీసుకుంది. బాబును స్కూలుకు తీసుకెళ్తున్నానని భర్తకు చెప్పి సెల్‌ఫోన్‌తో వెళ్లింది. డ్యూటీకి ఆలస్యం అవుతుండడంతో ఇంటికి తాళం వేసి భర్త ఆఫీసుకు వెళ్లిపోయాడు. అయితే, మధ్యాహ్నం 12.47 గంటలకు భర్తకు వీడియో కాల్ చేసి 'నా అనారోగ్యం కారణంగా మిమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దని నిర్ణయించుకున్నాను. నేను తనువు చాలించాలనుకుంటున్నాను. కాశీకి వెళుతున్నా.. నాకోసం వెతకొద్దు..' అంటూ 3 నిముషాలు మాట్లాడి సెల్ స్విచ్ ఆఫ్ చేసింది. ఆ వెంటనే గాలించినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో రమేష్‌బాబు బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఉమారాణి

కాశీకి వెళ్లి వచ్చిన పోలీసులు

ఉమారాణి ఫోన్ నెట్‌వర్క్ ఆధారంగా బాలానగర్ పోలీసులు కాశీకి వెళ్లారు. అక్కడి పోలీసులతో కలిసి ఆమె కోసం వెతుకున్నట్లు సమాచారం. అయితే, ఉమారాణి సెల్ నెట్‌వర్క్ చివరిసారిగా కాశీ చూపించినప్పటికీ ఎటువంటి అఘాయిత్యం చేసుకుని ఉండదని భావిస్తున్నారు. మరెక్కడికైనా వెళ్లిందేమోనని పోలీసులు అనుమానిస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



● కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి తల్లి ఆవేదన

గోల్నాక, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కమలానగర్‌లో రెండేళ్ల చిన్నారి లక్ష్మిని కుక్కలు కరిచి నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న విషయం విదితమే. ఏం జరుగుతుందో తెలియని స్థితిలో చికిత్సపొందుతుందని ఆ నిరుపేద తల్లి మమత ఆవేదనను వ్యక్తం చేస్తుంది. గోల్నాక డివిజన్ కమలానగర్‌లో నివాసం ఉంటున్న మమత, లక్ష్మణ్ దంపతుల రెండేళ్ల చిన్నారి శ్రీలక్ష్మి ఉంటున్నారు. మమత మాట్లాడుతూ తమ కుటుంబ పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ఒకవైపు భర్తకు యాక్సిడెంట్ అయిన కాలు, చేయి విరిగి రాడ్‌లు వేయడంతో అతను ఏమి చేయలేని దీనస్థితిలో ఉండగా ఇప్పుడు తన కూతురి పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. తన కూతురు ఆరోగ్య పరిస్థితి ఏమిటన్నది వైద్యులు ఇప్పుడే ఏమి చెప్పలేమంటున్నారని కన్నీటిపర్యంతరం అయ్యారు. తమకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడన్నారు. తన కూతురు పరిస్థితి చూస్తుంటే ఆందోళన కలుగుతుందన్నారు. ప్రభుత్వం తమను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆమె కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ-1 పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీ ఈ వినోద్‌కుమార్ తెలిపారు. గగన్‌మహల్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని లోయర్ ట్యాంక్‌బండ్, సాధురామ్ ఆస్పత్రి, బాదం గల్లీ తదితర ప్రాంతాల్లో ఉదయం 12 నుంచి మధ్యాహ్నం 3, రామకృష్ణమఠం పరిధిలోని అరవింద్‌నగర్, గణేష్‌టెంపుల్, బ్రుకా కాలేజ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 3.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రద్దు చేసిన డెమో రైళ్ల పునరుద్ధరణ

బర్కత్‌పుర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళా సందర్భంగా రద్దు చేసిన డెమో రైళ్లను ఈ నెల 11 నుంచి పునరుద్ధరిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాచిగూడ నడికుడి (67779,) నడికుడి కాచిగూడ (67780) కాచిగూడ - మహబూబ్‌నగర్ (67781). మహబూబ్‌నగర్- కాచిగూడ (67782) డెమో రైళ్లను పునరుద్ధరించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ఈ రైళ్లను పునరుద్ధరించినట్లు ఆయన చెప్పారు. ప్రయాణికులు డెమో రైళ్లను సద్వినియోగంచేసుకోవాలని వారు సూచించారు.



ఆశా వర్కర్లతో మాట్లాడుతున్న జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి

ప్రజల్లో నమ్మకం పెరిగేలా సేవలు అందించాలి

● జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి

ముషీరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రజలకు అందించే వైద్యంపై మరింత నమ్మకం పెరిగేలా ఆశావర్కర్లు కృషి చేయాలని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి సూచించారు. సోమవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో ఆశావర్కర్లు, వైద్య సిబ్బందితో వైద్య సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లు, ఇంటింటికి వెళ్లి గర్భిణీలు, అనారోగ్యంతో ఉన్నవారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించేలా కృషి చేయాలన్నారు. ఆస్పత్రిలో ఓపీ సేవలను పెంచాలని అన్నారు. భోలక్‌పూర్ యూపీహెచ్‌సీకి త్వరలో కొత్త డాక్టర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి, ఎస్‌పీహెచ్‌వోలు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సాయిబాబా, పీహెచ్ఎల్ స్పెల్లీస్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న కార్పొరేటర్ పావని

ఉల్లిగడ్డ బస్తీవాసికి కార్పొరేటర్ ఆర్థిక సాయం

చిక్కడపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉల్లిగడ్డ బస్తీవాసి కె.శ్రీనివాస్‌కు చికిత్స నిమిత్తం గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ ఆర్థిక సాయం అందజేశారు. శ్రీనివాస్ తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సోమవారం జవహర్‌నగర్ ఉల్లిగడ్డ బస్తీలోని ఆయన నివాసానికి చేరుకుని ఆయన తండ్రి కె. భూమయ్య, భార్య కె. సుజాతలను పరామర్శించారు. చికిత్స వివరాలను తెలుసుకుని వారికి ఆర్థిక సాయం అందజేశారు. అనారోగ్యం నుంచి త్వరలో కోలుకోవాలని ఆశిస్తున్నట్లు కార్పొరేటర్ పావని తెలిపారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, సీనియర్ నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఆనంద్‌రావు, లక్ష్మీనారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్‌ను సన్మానించిన పార్టీ నాయకులు పూసగోరక్‌నాథ్, వెంకటేష్, సదా తదితరులు

బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

ముషీరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు అంకిత భావంతో కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్ అన్నారు. సోమవారం ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎడ్ల హరిబాబు యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ముషీరాబాద్‌లో చేపడుతున్న పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ బీఆర్ఎస్ నాయకులు పూసగోరక్‌నాథ్, వెంకటేష్, సదా, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో వినియోగదారుల కోర్టులు

చిక్కడపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ప్రతి వ్యక్తి వినియోగదారులేనని, వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ప్రతి జిల్లా స్థాయిలో వినియోగదారుల కోర్టులు అందరికి అందుబాటులో ఉన్నాయని తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేశ్వర్ అన్నారు. అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల ఉత్సవాలు ఈ నెల 7వ తేదీ నుంచి 15 వరకు జరుగుతున్న క్రమంలో సోమవారం వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గోల్కొండ చౌరస్తాలోని తూనికలు, కొలతల శాఖ రాష్ట్ర కంట్రోలర్ కార్యాలయంలో వినియోగదారుల హక్కులపై చైతన్య కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంతర్జాతీయంగా అమలులో ఉన్న వినియోగదారుల హక్కులకు సంబంధించిన పోస్టర్‌ను రాజేశ్వర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకు అందుబాటులో ఉన్న వినియోగదారుల కోర్టులను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తూనికలు, కొలతల శాఖ సిబ్బంది, వినియోగదారుల మండలి సభ్యులు పలువురు పాల్గొన్నారు.